

రాత్రి పన్నెండు గంటలు దాటింది. అమావాస్య రాత్రి. చిమ్మ చీకటిగా ఉంది. నక్షత్రాలు మాత్రం ఉజ్వలంగా మెరుస్తున్నాయి. బెజవాడ నుంచి వస్తున్న టాక్సీ హైదరాబాద్ పొలిమేర చేరుకుంటోంది. దూరాన్నుంచి ఎంతో ఎత్తుగా, బ్రహ్మరాక్షసి గుడ్లులాగా మెరుస్తూ, ఆకాశవాణి ప్రసారంచేసే రేడియో స్తంభాలపై ఎర్రని దీపాలు మెరుస్తున్నాయి. ఆ దీపాలు చూడగానే, హైద్రాబాద్‌లో జరుగుతున్న రక్తపాతం కళ్లకి కట్టినట్లయి గుండె ఝల్లుమంది వెంకటేశానికి.

ఎదురుగుండా లారీ వస్తోంది వేగంగా. లారీదీపాల వెలుగు టాక్సీలో పడి, వెంకటేశం దృష్టి మార్చింది. లారీ మహావేగంగా వస్తోంది టాక్సీ అంతకన్నా వేగంగా ఎదురు వెళ్తోంది. వేగం తగ్గించమని డ్రైవరుకు చెబుదామనుకున్నాడు వెంకటేశం. కాని నోరు పెగిలి రాలేదు. ఏది జరుగుతే అది జరుగుతుందిలే అనే నిర్లిప్తత ఏర్పడింది.

లారీ దగ్గరకు వచ్చేస్తోంది. ఆ కాంతిలో, రోడ్డు ఎంత ఇరుకుగా ఉన్నది స్పష్టంగా కన్పిస్తోంది. టాక్సీడ్రైవర్ వెంటనే టాక్సీని ప్రక్కకు పోనిచ్చి సడన్ బ్రేక్ వేశాడు. కీచుమని అరుచుకుంటూ ఒక్క కుదుపుతో టాక్సీ ఆగింది. మహా వేగంతో లారీ, టాక్సీని ఇంచుమించు రాసుకుంటూ, దూసుకుపోయింది. వెనక్కు తిరిగి చూసేసరికి కనుమరుగైపోయింది. టాక్సీ కుదుపుతో ముందు సీట్లో కూర్చున్న వెంకటేశం ముఖం, ముందు ఉన్న అద్దానికి కొట్టుకొంది. అద్దం పగలలేదు. తలా పగలలేదు. కాని నుదుటన బొప్పి మాత్రం కట్టింది. కెవ్వుమని కేకవేస్తూ వెనక సీట్లో హాయిగా నిద్రపోతున్న ముగ్గురూ లేచారు ముందు సీటుకు కొట్టుకున్న వారి ముక్కులపై చేతులు వేసుకుంటూ. వాళ్ల అరుపుల్లో "సారీ సార్" అన్న డ్రైవర్ మాట ఎవరికీ వినిపించలేదు.

"అంత తొందర ఏమొచ్చింది ... నెమ్మదిగా నడపరాదా?" అన్నాడు వెంకటేశం.

"మళ్ళీ రిటరన్ ట్రిప్‌లో విజయవాడకి వెళ్లిపోవాలి సార్. అయినా యిది మీకుకొత్త కాని మాకు అలవాటే" అన్నాడు డ్రైవర్

"ఏమి అలవాటో... మాకు ముఖాలు పగిలాయి" అన్నాడు వెనకసీట్లోని ఒకాయన.

"ఈ టాక్సీలవాళ్లూ, లారీలవాళ్లూ ఇంతేనండీ! ప్రాణాలమీద ఆశవదులుకుంటేనే వీటిమీద రావాలి. ప్రాణంమీదకు వచ్చిన, అవసరంపడితేనే, ప్రాణాలకు తెగించి, ఇవాళ ఈ టాక్సీ ఎక్కాను. ఆ ఏడుకొండలవాడు చల్లగా చూశాడు:కాని లేకుంటే మళ్లీరిటరన్ ట్రిప్ అవసరమే లేకపోయేది" అన్నాడు ఇంకో ఆయన.

"ఏమైనా మనచేత మంచి ఎడ్వంచర్ చేయించాడు డ్రైవర్. టేక్ ఇట్ ఈజీ" అంటూ ఆవలిస్తూ చెప్పాడు మూడోఆయన.

వెంకటేశానికి ఈ సంభాషణ అంతా విసుగ్గా వుంది. ఎప్పుడువెళ్ళి ఇంట్లోపడతానా అని వుంది. జేబులోంచి సిగరెట్‌తీసి ముట్టించాడు.

"సార్... ఆ అగ్గిపెట్టె ఓ సారి ఇల్లా ఇయ్యండి" అన్నాడు వెనకసీట్లో మధ్య కూర్చున్నాయన.

ఏమీ మాట్లాడకుండా అగ్గిపెట్టె తీసి అందించాడు వెంకటేశం.

"థాంక్యూ" అంటూ అది తీసుకుని సిగరెట్ ముట్టించాడు ఆయన అదే పుల్లతో ఆయనకి ఒక ప్రక్కనున్నాయన బీడీ మరొక ప్రక్కనున్నాయన సిగరెట్ ముట్టించుకున్నారు. అగ్గిపెట్టె తిరిగి యిస్తూ "మీరు ఏపేటకి వెళ్ళాలి సార్?" అన్నాడు ఆయన వెంకటేశంతో.

"యాకుత్‌పురా" అన్నాడు వెంకటేశం.

"అబ్బా ... అది బాగా ముస్లింలుండే లొకాలిటీ! ఇంతరాత్రప్పుడు అక్కడికి ఎల్లా వెళ్తారుబాబూ ?" అన్నాడు ఆయన.

"యాకుత్పురానా ! హిందూ ముస్లిం తగాదాలు వచ్చాక అక్కడ అల్లర్లు జరుగని రోజులేదు రోజూ పేపర్లో చూస్తూనే ఉన్నాంకదా" అన్నాడు మరొక ఆయన.

"చూడు బాబూ నీపేరేమిటి ?" అని అడిగాడు బీడీ కాలుస్తున్నాయన పొడిదగ్గు దగ్గుతూ.

"వెంకటేశం" అన్నాడు వెంకటేశం, ఈ సంభాషణపట్ల ఇరకాటపడుతూ.

"పెద్దవాడిని చెబుతున్నాను నామాట వినుబాబూ ... నీవువెళ్లేచోటు మంచిదికాదు. ఈ రాత్రికి ఎక్కడైనా పడుకుని పగటిపూట ఇంటికి వెళ్లు" అన్నాడాయన.

'అంత భయపడడానికి ఏముందండీ ! ఏదో రౌడీమూకలు కొట్టుకుని చస్తారుకాని మనజోలికి ఎవరొస్తారండీ ?" అన్నాడు వెంకటేశం.

"అల్లా అనకండి సార్. ఈమధ్య కలహాలు వచ్చిన తర్వాత అపోహకు గురి అవుతోంది ఏమీ ఎరుగని అమాయక ప్రజలే... మొన్నీమధ్య మా బావమరిది, సినిమా నుంచి ఇంటికి వస్తుంటే యాకుత్‌పురాలోనేగా పొడిచింది" అన్నాడు మొదటి ఆయన.

"అరే అల్లాగా! ఇప్పుడెల్లాగున్నాడాయన" అన్నాడు వెంకటేశం ఆత్రంగా.

"మా చెల్లెలు పుస్తె గట్టిదవడంవల్ల గండం గడిచింది సార్. ఉస్మానియాలో కోలుకుంటున్నాడు" అన్నాడు ఆయన నిట్టూరుస్తూ.

"పోనీ మీకు అభ్యంతరం లేకపోతే, మా యింటికి వచ్చేయండి. మేము ముగ్గురం ఒకింటి వాళ్ళమే. నారాయణగూడాలో వుంటున్నాము. అక్కడేగొడవలు లేవు. ప్రొద్దున్న వెళ్దురుగాని" అన్నాడు మూడో ఆయన

"అవును బాబూ. ఆ విధంగానే చేయి. మొండి ధైర్యంతో ప్రమాదం తెచ్చుకోకు" అన్నాడు పెద్దాయన.

"ఫర్వాలేదండి. మీరింతగా చెప్తున్నారు కాబట్టి. ఈ రాత్రికి ఏ స్నేహితుని గదిలోనో పడుకుని తెల్లారి వెళ్తాను. మీమాటఎందుకు కాదనాలి?" అన్నాడు వెంకటేశం.

"మంచిది బాబూ" అన్నాడు పెద్దాయన.

సంభాషణలో తెలియకుండానే హైదరాబాద్ వచ్చేసింది. అప్పుడే మలక్‌పేట వచ్చేసింది. నగరంరాగానే టాక్సీని మౌనం ఆవరించింది.

చాదర్‌ఘాట్ వంతెన వచ్చేసింది. టాక్సీ ఆపమని చెప్పి వెంకటేశం దిగిపోయి అందరి దగ్గరా సెలవు తీసుకున్నాడు.

టాక్సీ వెళ్ళిపోయింది.

## 2

రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. అల్లరిమూకలు పగలకొట్టగా మిగిలిన కొద్ది లైట్లు మినుకు మినుకు మంటున్నాయి. వెంకటేశం ఆలోచనలో పడ్డాడు. గత కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరం మత కలహాలతో అట్టుడికి పోతోంది. వీటిఫలితంగా ఇరువర్గాల వారిలోనూ అనేకమంది మృతి చెందారు. ఎందరో అనేక బాధలకు గురి అయ్యారు. ఈ అదును చూసుకుని గూండాలు, దొంగలూ విశృంఖలంగా విజృంభించారు. అనేకమంది భయంతో నగరంవదిలి వెళ్ళిపోయారు. మరికొందరు తమ సంసారాలని వేరేఊళ్ళకి పంపించేసి, తాము మాత్రం ఉండిపోయారు. ఈ విధంగా నగరమంతా అల్లకల్లోలంగా ఉంది.

వెంకటేశం ఉంటున్న 'యాకుత్పురా' ప్రాంతం, ప్రధానంగా మహమ్మదీయులు ఉన్నట్టిది. అక్కడ ప్రతిరోజూ ఏదో గడబిడ జరుగుతూనే ఉంటోంది. ఎంతోమంది హిందువులు కత్తిపోట్లకు గురిఅయ్యారు. తత్ఫలితంగా కొంతమంది చనిపోయారు కూడా. వెంకటేశం ఇంటి చుట్టు ప్రక్కల నున్న హిందువు లందరూ, భయాపహులై ఇళ్లకి తాళం పెట్టి ఊళ్లకు వెళ్లిపోయారు. ఊరు వదలి వెళ్లిపోదామన్న ఇంటిలోని పోరు ఎక్కువైపోయింది వెంకటేశానికి. అయితే అతనికి మాత్రం ఉద్యోగ రీత్యా ఊరు వదిలిపెట్టి వెళ్లే అవకాశంలేదు. అందువల్ల తన సంసారాన్ని, క్రితంరోజు తీసుకునిపోయి, విజయవాడలోని మామ గారింటివద్ద వదిలివచ్చేశాడు. తాను ఒక్కడూ తిరిగి హైదరాబాద్ రావడానికి భార్య ఎంత మాత్రమూ ఒప్పుకోలేదు. అయితే తాను రాత్రిళ్లు ఆ ప్రాంతంలో ఉండననీ, ఏ స్నేహితుని ఇంట్లోనో, ఆఫీసులోనో సురక్షితంగా ఉండే ప్రాంతంలో ఉంటాననీ ఖాయంగా చెప్పి తిరిగి వచ్చాడు.

ఇళ్లు వదిలి ఊరు వెళ్లిన వాళ్ల ఇళ్లలో చాలా దొంగతనాలు జరుగుతున్నాయి. తాము లేని సమయంలో తన యిల్లు ఎల్లాగుందోననే ఆందోళన కలిగింది వెంకటేశానికి. వెంటనే ఇంటికి వెళ్లాలని అడుగు ముందుకు వేశాడు.



మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
శస్త్రచికిత్స
అవసరములేదు!

మా నూతన ప్రచురణలు




సి. ఆనందారామం

| | |
|---|---|
| జాగృతి | 6-00 |
| అజ్ఞాత బంధాలు | 6-00 |
| దశావతారములు | 6-00 |
| మమతల కోవెల | 6-00 |
| మారే కాలంలో మారని విలువలు | 6-00 |

కావిలిపాటి విజయలక్ష్మి

| | |
|---|---|
| బాకులాంటి లేఖ | 6-00 |
| అపశ్రుతులు | 6-00 |

పై వాటిలో ఏ మూడు పుస్తకాలకు M.O చేసినా పోస్టేజీ ఉచితం. V.P.P పద్ధతి లేదు!

నవ్య స్టూడెంట్స్ బుక్ సెంటర్
ఏలూరు రోడ్డు : విజయవాడ-2
PHONE : 74677


## చీకట్లో వెంటాడిన నీడ

టాక్సీలో వాళ్ల హెచ్చరిక జ్ఞాపకానికి వచ్చి వెన్ను చరిచినట్లయింది.

మినుకు మినుకు మంటున్న దీపాలు, నిర్మానుష్యంగా ఉన్న వీధులు, చీకట్లు కురిపిస్తున్న అమావాశ్య రాత్రి, మూసీనది మీద నుంచి వస్తున్న చల్లని ఈదురుగాలి భయం కలిగిస్తున్నాయి. తాను అంత రాత్రి అపుడు ఇంటికి వెళ్లడం మంచిది కాదేమో. ఇంకెక్కడికైనా వెళ్లడం మంచిదేమోనని పించింది.

తన భయాన్ని చూసి మనస్సు అపహసించింది. వెంకటేశం స్వతహాగా గుండె ధైర్యం కల మనిషి. తనకి కలుగుతున్న భయం అర్థంలేనిదనిపిస్తోంది. భయపడుతున్న తనని చూసి తనకే నవ్వు వచ్చింది. 'ఛ! ఏమవుతుంది? అనవసరంగా నేను భయపడుతున్నాను నన్నెవరేమి చేస్తారు? ఎవరైనా ఏమైనా చేస్తే తాను ఊరుకుంటాడా? ధైర్యం పుంజుకొని ఇంటికి వెళ్లడానికే నిశ్చయించుకున్నాడు. దగ్గరలో ఏదైనా రిక్షా ఉందేమోనని కలయజూశాడు. కాని ఏమీ కనిపించలేదు.

నడుచుకుంటూ ముందుకు సాగాడు వెంకటేశం. కమల్ టాకీసు సమీపంలో ఒక రిక్షా కనిపిస్తే దానిని పిలిచాడు.

"కాఁ జానా?" అంటూ దగ్గరికివచ్చాడు రిక్షావాలా రిక్షా తొక్కుకుంటూ.

"యాకుత్పురా" అన్నాడు వెంకటేశం.

"యాకుత్పురా!" అని భయంతోకూడిన ఆశ్చర్యంలో అని "నై ఆతా సాబ్" అన్నాడు రిక్షావాలా, రిక్షాని మళ్లీ వెనక్కి త్రిప్పి వెళ్ళిపోతూ.

మరికొంచెం దూరం ముందుకు నడిచాడు వెంకటేశం. వెనకనుంచి ఒక ఖాళీరిక్షా వచ్చింది. వెంకటేశం దానిని ఆపి "యాకుత్పురా వస్తావా ?" అని అడిగాడు.

రానని ఉర్దూలో అంటూ ముందుకు సాగిపోయాడు ఆ రిక్షావాడు.

వెంకటేశం మనసులో ఆందోళనతో పాటు భయంకూడా చోటుచేసుకుంది. ఆన వెంట టాక్సీలో వచ్చిన ముగ్గురి హెచ్చరికా జ్ఞాపకానికి వచ్చింది. పెద్దవాళ్లు ఎందుకు చెప్పారో చెప్పారు ఈ ఒకరాత్రి తాను ఇంటికి వెళ్ళకుండా ఉంటే మించిపోయేది లేదు. ఏ స్నేహితుని ఇంటికైనా రూమ్‌కైనా వెళ్ళడం కష్టంకాదు. కాని అతని అంతరంగంలో భయాందోళనతోపాటు మొండి ధైర్యంకూడా పరిమాణం పెంచుకుంటోంది. చివరకి దానిదే పైచేయి అయింది. ఏమవుతుందో చూద్దామని, నడిచైనాసరే వెళ్లిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు వెంకటేశం.

ఆలోచనలతో ముందుకు నడవసాగాడు ఒంటిగా. "రిక్షా హోనాసాబ్ ?" వెనకనుంచి వినవచ్చిన శబ్దంతో ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు వెంకటేశం.

రాడనుకుంటూనే "యాకుత్‌పురావస్తావా గాంధీ పుల్లే దగ్గరికి" అని అప్రయత్నంగా తెలుగులో అడిగాడు వెంకటేశం.

"యాకుత్పురా!" అని ఒక్క క్షణం ఆలోచించి "ఏమిస్తావ్?" అని తెలుగులోనేఎదురు ప్రశ్న వేశాడు రిక్షావాడు.

"ఏమిమ్మంటావ్?" అని తిరిగి అడిగాడు వెంకటేశం.

"ఒక్కటేమాట దేడ్ రూపాయి ఇయ్యి సాబ్" అన్నాడు రిక్షావాడు.

ఎప్పుడూ నలభై పైసలకన్నా ఎక్కువ అడగని ఆ ప్రాంతానికి, ఎంత రాత్రయినా రూపాయిన్నర అడిగేసరికి ఏమీ తోచలేదు వెంకటేశానికి.

"నేనేమైనా కొత్తవాడి ననుకుంటున్నావా? ఎప్పుడూ ఇచ్చేది నలభై పైసలు. రాత్రి కనుక అర్థరూపాయిస్తాను ఒక్కటే మాట" అన్నాడు.

"ఈ గడబిడ దినాల్లో, యింత రాత్రి యాకుత్‌పురాకి ఎవరొస్తారు సాబ్, ఆఖరి మాట. ఒక్క రూపాయి ఇస్తావా పొమ్మంటావా" అంటూ సైకిల్ పెడల్ ఒక్కసారి తొక్కాడు రిక్షావాడు.

ఒక్క క్షణం ఆలోచించాడు వెంకటేశం. మాటల్లో సబబు కనిపించింది. పైగా ప్రమాద ప్రాంతమని తెలిసి తెలిసీ ఎందుకు నడిచి పోవడం! అయినా ప్రయాణం చేసి వచ్చాక విసుగ్గా ఉండి, ఎప్పుడు ఇంటికిపోయి నడుం వాలుద్దామా అనిఉంది. అవసరానికి ఎంతైనా తప్పదు అనుకుని "మంచిది. రా" అని రిక్షాని పిలిచాడు.

రిక్షా దగ్గరకు రాగానే, బ్రతుకు జీవుడా అని అందులో కూలబడ్డాడు.

వేసవికాలం...కొండగాలి జమ్మని వీస్తూ అలసిపోయిన దేహానికి జోల పాడుతోంది. ఏదురు గాలిగా నున్నందువల్ల, పై టాపు

తీసేశాడు రిక్షావాడు.

రిక్షా నెమ్మదిగా సాగివెళ్తుంది. రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి డబీర్‌పురా మెయిన్ రోడ్డు మీదకి రిక్షా వచ్చింది. ఇరవైనాలు గ్గంటలూ తెరచి ఉండే ఇరాని హోటళ్ళు కూడా మూసి ఉన్నాయి. గుర్రాల మీద ఎక్కి గస్తీ పోలీసులు ఎదురుగా వస్తున్నారు. దూరాన్నుంచే రిక్షాని చూసి "ఏయ్ రిక్షా కహాఁ జాతేరే సాలే" అంటూ ఒక పోలీసు గట్టిగా అరిచాడు.

ఆ కేక విని రిక్షాని ప్రక్క సందులోకి పోనిచ్చి వడి వడిగా త్రొక్కడం మొదలు పెట్టాడు. రిక్షావాడు.

"ఈ గడబిడలు షురూ అయినాక మాకీ పొట్టమీద కొట్టినాదిసాబ్. ఈకట్‌మల్‌వాళ్ళు మమ్మల్ని అస్సల్కి బతకనియ్యడం లేదు." అన్నాడు.

"ఈ గడబిడలు తగ్గలేదా ?" అని అడిగాడు వెంకటేశం.

"ఏమి తగ్గినాయి సాబ్ ... కల్ రాత్ మాసాలాని హిందూలోగ్ పొడిచినారు" అన్నాడు రిక్షావాలా.

వెంకటేశం గుండె ఝల్లుమంది. "హిందూలోగ్" అంటున్నాడు. అంటే వీడు ముసల్మాన్నన్నమాట. ఎంత పొరపాటయి పోయింది! తను తెలుగులో మాట్లాడు తుండడం చూసి, తాను హిందూ అని వీడు పసిగట్టే ఉంటాడు వీడేమీ నాప్రాణం తియ్యడుకదా! వెంకటేశం మనస్సు పరిపరి విధాల పోతోంది.

"ఏమిసాబ్ ... నీది ఈఊరుకాదా ?" అని అడిగాడు రిక్షావాడు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

"యేంయాశహర్" అంటూ అప్రయత్నంగా ఉర్దూలో సమాధానం చెప్పాడు వెంకటేశం వెంటనే వెన్నుమీద భయం మరో చరుపు చరిచింది. 'బయటి ఊరు వాళ్ళంటే వీళ్ళకేమీ కోపం ఉండదేమో ఈఊరివాడినని తెలియగానే వాడిలో పగ రేకెత్తుతుందేమో. ఇదేమి ప్రారబ్దం తెచ్చి పెట్టుకున్నానురా నాయనా" అనుకుంటూ మనస్సులో పరిపరి విధాల వాపోవసాగాడు. చల్లని గాలి తగులుతున్నా వెంకటేశానికి ముచ్చెమటలు పోస్తున్నాయి.

"అయితే నీవు ఊళ్లో లేవా సాబ్?" అని మళ్ళీ తెలుగులో ప్రశ్న వేశాడు రిక్షావాడు.

"లేను ఊరెళ్ళి ఇప్పుడే తిరిగి వస్తున్నాను" అంటూ ముక్తసరిగా తెలుగులో సమాధానం చెప్పాడు వెంకటేశం. నావిషయం కనుక్కొని నా సంగతి తేల్చేటట్టున్నాడు వీడు" అని వెంకటేశానికి వణుకు ప్రారంభమయింది.

కొంచెం దూరంలో ఒక చిన్న కాకా హోటలూ, దానిముందు ఒక బడ్డీ కొట్టు కనిపిస్తున్నాయి. వాటిని సమీపించగానే రిక్షా ఆపి "బీడీ ముట్టించుకుని వస్తాను సాబ్" అని ఉర్దూలో చెప్పి రిక్షా ఆపి వెళ్లాడు రిక్షావాడు.

"ఈసారి ఉర్దూలో మాట్లాడాడు వీడు. అంటే వీడు నేను ఈ వూరివాడినేనని ఖాయ పర్చుకున్నాడన్నమాట. తొందరగా పోనీయక ఇక్కడెందుకాపాడో ఈ ముండాకొడుకు"— వెంకటేశానికి భయంతో నాలిక తడి ఆరి పోతోంది.


అటుప్రక్కకు చూశాడు వెంకటేశం. హోటల్లో ఒక బల్ల చుట్టూ నలుగురు కూర్చుని ఏదో మాట్లాడు కుంటున్నారు. వాళ్ళ గడ్డాలూ, లుంగీలు చూస్తే, ముస్లిములని అనిపిస్తోంది. రిక్షావాడు బడ్డీకొట్టు వాడితో ఏదో మాట్లాడుతూ బీడీ ముట్టించు కుంటున్నాడు. వెల్తురులో వాడి ఆకారం స్పష్టంగా చూశాడు వెంకటేశం. గళ్ళలుంగీ—తురక గడ్డం—స్పష్టంగా మహమ్మదీయు డని తెలుపుతున్నాయి. తను రిక్షా ఎక్కి నప్పుడు ఇవేమీ గమనించలేదు పైగా అప్పుడు వెల్తురుకూడా సరిగ్గాలేదు. గమనించి ఉంటే తాను అసలు ఆ రిక్షా ఎక్కి ఉండేవాడు కాదు ఇప్పుడు ఏమనుకుని ఏమి లాభం. ఏం జరిగినా అనుభవించవల్సిందే. తన హ్యాండ్‌బాగ్‌లో డబ్బు కూడా ఎక్కువగానే ఉంది. మతం కోసం కాకపోయినా, మత కలహాలను అడ్డుపెట్టుకుని తన డబ్బు కోసం, చేతినున్న ఖరీదైన వాచికోసం, ఈ రిక్షావాడు తనని చంపినా చంపవచ్చు." వెంకటేశం వెన్నులోంచి భయం పైకి ప్రవహిస్తుంది.

రిక్షావాడూ, బడ్డీకొటు వాడూ ఏదో మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్య ఆ బడ్డీకొట్టు వాడు తనవేపు చూడడం గమనించాడు వెంకటేశం. రిక్షావాడు కూడా తన వంక చూస్తున్నాడు. మధ్య మధ్య. "సందేహంలేదు. వీళ్లిద్దరూ తనపై ఏదో కుట్ర పన్నుతున్నారు, అసలు తను గమనించలేదుకాని, ఈ రిక్షావాడి ప్రవర్తన మొదటినుండీ అనుమానంగానే వుంది. వాడంతట వాడే అడిగాడు "రిక్షా కావాలా?" అని. ఎవ్వరూ రానన్న యాకుత్పురాకి వీడు వచ్చాడు. ఏ దురుద్దేశంలేనిదే ఎందుకు వస్తాడు? బీడీ ముట్టించుకోడం ఇంతసేపా! ఇదంతా నటన. ఈ సాకుతో ఏదో కుట్ర పన్నుతున్నాడు—" ఏమి చేయడానికి పాలుపోవడంలేదు, వెంకటేశానికి. బయంవల్ల ఏర్పడ్డ చలితో వళ్లు వణుకుతోంది. ఆలోచనలతో, ఆందోళనలతోనూ మెదడు వేడెక్కి పోతోంది.

"క్యోం క్యా హై సాబ్" అన్న రిక్షావాని ప్రశ్నతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు వెంకటేశం. బడ్డీకొట్టు దగ్గరనుంచే అడి

---

## ప్రపంచంలో ఎత్తైన హొటల్



ప్రపంచంలో అతి ఎత్తయిన హోటల్ జార్జియాలోని అట్లాంటాలో ఉంది. బొమ్మలో మధ్య కన్పిస్తున్న దీని పేరు ప్లాజా హోటల్. 70 అంతస్తులు, 1,100గదులు కల ఈ హోటల్ భవనం వీధి మట్టానికి 220 మీటర్ల ఎత్తు ఉంది. అంతేకాకుండా భూగర్భంలోవున్న అంతస్తులో 500 మోటారు వాహనాలు నిలబెట్టుకోడానికి తగిన వసతి ఉంది.

గాడు, చీకటిలో వాచీలో మెరుస్తున్న ముళ్ళ వంక చూసి "ఏక్ బజే" అన్నాడు అతి కష్టంమీద నోరు పెగిల్చి, వెంకటేశం. సమాధానం చెప్తుంటే గొంతు జీరబోయింది

"సందేహం లేదు. వాడు ఏదో దుష్ట

## చీకట్లో వెంటాడిన నీడ

ప్రయత్నంలోనే ఉన్నాడు. నా చేతికి వాచీ వుందో లేదో చూడడంకోసం కాకుంటే వీడికి ట్టైమెంత్తైతే ఎందుకు"– వెంకటే




శానికి నాలుక పిడచకట్టుకు పోతోంది. రిక్షాలోంచి క్రిందకు దూకి పారిపోతే బాగుం డుననిపిస్తోంది. కాని ధైర్యం చాలడంలేదు. పారిపోతే ఇప్పుడే వెంటబడి చంపుతారేమో! 'భగవంతుడా నీదే భారం' – అనుకొంటూ భయంతో గట్టిగా కళ్ళుమూసుకొని దైవ ధ్యానం చేయసాగాడు వెంకటేశం.

దగ్గరలో ఎవరో దగ్గుతున్న శబ్దం విని పించింది. కళ్ళు తెరచి చూశాడు వెంకటేశం హోటల్లో ఉన్న నలుగురిలో ఒకడు బయటకు వచ్చి రిక్షావాడితో ఏదో మాట్లాడుతున్నాడు, రిక్షావంక చూస్తూ. రిక్షావాడు ఏదో సమా ధానం చెప్తున్నాడు తన వంక వేలితో చూపిస్తూ.

"అనుమానంలేదు. వీళ్ళంతా ఏదోదొంగల ముఠాలా ఉన్నారు ఈ కాకాహోటల్ మతో న్మాదుల కూడలి స్థలమయ్యుంటుంది. వేతు లారా తను పులినోట్లో తలదూర్చాడు." తన బుద్ధితక్కువకి తనని తానే కసితీరా తిటు కోసాగాడు వెంకటేశం. పెద్దవాళ్ళ సల హాని పెడచెవిని పెట్టినందుకు తనకీ శాస్తి కావలసిందేననుకున్నాడు. తన జీవితానికి ఇంక ఆఖరుక్షణాలు దాపురించాయి కళ్ళుమసగలు క్రమ్ముతున్నాయి. క్రిందభూమి తిరుగుతున్న ట్లనిపిస్తోంది. ప్రత్యక్ష నరకం అనుభవించ సాగాడు.

భార్యా బిడ్డలు జ్ఞాపకానికొచ్చారు వెంక టేశానికి. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. తాను దిక్కులేని చావు చావబోతున్నాడు. చివరికి తన మరణవార్త అయినా తన వాళ్లకి తెలు స్తుందో తెలియదో! తాను ఎవర్తైందీ తెలిపే గుర్తు కూడా తన దగ్గరలేదు. తన శవం చివ రకి, రోడ్డు ప్రక్కన దిక్కులేక పడివుంటే అది ఎవరిదైనదీ కూడా తెలియక, మునిసిపల్ వాన్‌లోపడేసి తీసుకొనిపోయి, శవపరీక్ష కోసం ఒళ్లంతా కోసి చివరకి ఏ దహన సంస్కా రమూ లేకుండా గోతిలో పాతిపెట్టేగతి తన ముఖాన రాశాడు కాబోలు బ్రహ్మ"– ఇంక ఆలోచించలేకపోయాడు వెంకటేశం– కళ్లు గట్టిగా మూసుకుని తల పట్టుకున్నాడు.

రిక్షా కుదుపుతో మళ్లీ కళ్లు తెరిచాడు.

రిక్షావాడు "మాఫ్ కర్నా సాబ్... జరా దేర్ హో గయా" అంటూ రిక్షా తొక్కడం ప్రారంభించాడు.

వెనక్కి తిరిగి చూచాడు వెంకటేశం. చీకట్లో ఎవరూ కనిపించడంలేదు. ఎదురు

# సామాన్యుని సణుగుడు

అయ్యా! ఆకాశంలో ప్రయాణం చేసే 'ధరల రథచక్రాలను' భూమార్గం పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. బాగానే వుంది. బియ్యం ధరలు తగ్గాయి— మహదానందంగా వుంది. సరే! కొన్ని టాయ్‌లెట్ సబ్బుల రేట్లు పడ్డాయి— సబ్బు వాడుకున్న రేపర్ తిరిగి యిస్తే— పది పైసలు తక్కువ రేటుకే మా సబ్బులు అమ్ముతాం అంటూ వో కంపెనీవారు ప్రకటించారు....సంతోషం! అయితే కూరగాయల, ఉల్లిపాయల రేట్లు మాత్రం "స్ప్రెన్సర్" రేట్లలాగా వున్నాయి— సరే... ధనుర్మాసంలోనైనా యివి తగ్గుముఖానికి రావా? అన్న ఆశ వుంది... యీలోగా కొత్త కూరగాయల స్థానే పాత వూరగాయలతో ఎలాగో యీ ఆత్మారాముడి గోల చల్లారుస్తాం...బాగానే వుంది కానండీ,మరో ఖరీదైన పదార్థముందండీ ... అయ్యా కోడిగుడ్లు అనుకుంటున్నారా? కాదు కాదు... అవి కొనలేము; తినలేము. వూరికే అలా చూసి చాలా బలమైన ఆహారం కదూ...రేడియోలో తినమంటూంటారు యివేగా అనుకుంటాం. కాని... "పాలు"- ఈ పాలు అనే పదార్థం మాత్రం తెల్లారేసరికి యింటికి రాకపోతే మాత్రం కాఫీగతప్రాణి అయిన సామాన్యుడికి యిక ఆ రోజు అంతా వొంట్లో సత్తువుండదుగా... అంచేత పాలు కూడా తెలుగు సిన్మాలాగే మామూలు మనిషి నిత్యావసర అత్యవసర వస్తువుల్లో ఒకటే... ఔనామరి,

ఆవుపాలా? గేదెపాలా? మేకపాలా? ఏవి శ్రేష్ఠం అని అడగకండి. మనకి తెల్సు— మనకి "సీసాపాలే" సమస్తం... ప్రాజెక్టుపాలే యింటిల్లిపాదికి ఆరోగ్యకరం. వీటికి ఉత్పత్తిదారు సౌకర్యార్థం...ఆమధ్య రేటు పెరిగింది.. పాల ఉత్పత్తిదారు అంటే గేదె కాదా? అన్న అనుమానం ఎవరికేనా వస్తే అదిరాకూడదు. ఉత్పత్తిదారు అంటే గేదెలుగల ఆసామీ అన్నమాట! "రైతు" అని కూడా అంటారు కొందరు. అయితే గేదెలు తినే గడ్డి, తవుడు మరియు పౌష్టికాహారం... అదేదో వుంటుందిగా మరి...రేడియోలో చెప్తూంటారు... అది యివన్నీ గాక రైతుకు కావల్సిన ఎరువులు గట్రా రేట్లు కూడా తగ్గుతున్నాయి అంటున్నారు కదా... మరి అలాంటప్పుడు యీ పాల వ్యవహారంలో కూడా ఏమైనా మార్పు రాకూడదా? అని ఓ సందేహం కలుగొచ్చు... సామాన్య జనానికి. కాని ఆ రేటులోను, శీతాకాలమే అయినా ఆ పాలలో వుండు క్రొవ్వురేటులోను మార్పులేదు... కాపోతే ఓ కొత్తతనం వుంది. ప్రాజెక్టువారు వారానికో, పక్షానికో వోసారి పాలసీసాల మూతలు [యివి తగరానివి కాస్టీ కూడాను...!?] అంటే మూతల రంగులు మార్చేస్తున్నట్లు దినపత్రికల్లో ప్రకటనలు వెలువడుతుంటాయి. ప్రకటన అంటే స్టేటుమెంట్‌లు, అడ్వర్‌టైజమెంట్‌లు కావు... లోపలి పాలు అవే... అందులో క్రొవ్వు శాతం అదే... తతిమ్మా 'షరాలన్నీ' మామూలే. రోజా ప్రొద్దున్నే సీసామూతలు మొదట చూసే యిల్లాళ్ల కళ్లకి కొంత "రిలీఫ్"గా యీ రంగులు మారుస్తున్నారా? ప్రాజెక్టువారు? అన్న అనుమానం సహజమే గాని... కాదు కాదు వారు కల్తీ నిరోధం కోసం యీ రంగులు మార్చుతున్నారూ అని కొందరు పరిశీలకుల అంచనా! భేష్! అయితే మంచిదే గాని... వెనకటికి వో బామ్మగారు కొబ్బరికాయల్ని దొంగలు కోసుకుపోకుండా ఆచెట్టుకి తన కొత్త సైను పంచని మడిబట్టచేసి కట్టిందిటా... అట్లాగా... అన్నట్లు మనం పాలరేటు సంగతి కదూ అనుకుంటున్నాం. అది యింకా నూటఎనభై పైసలేనండి ... మార్పేమీలేదు... [సిరాజీ]

---

గాలిని ఎదుర్కోలేక సైకిల్ చైను టక్కు టక్కు మంటోంది. నెమ్మదిగా నిండు చూలాలిగా నడుస్తోంది రిక్షా. వెనకాల అడుగుల చప్పుడు అస్పష్టంగా వినవస్తోంది. "నిస్సందేహంగా హోటల్లోనున్న ఆ నలుగురే వస్తుండి ఉంటారు. ఈ రిక్షావాడు కూడా కావాలనే నెమ్మదిగా రిక్షాలాగుతున్నట్లున్నాడు. నన్ను చంపడానికి వాళ్ళకి అనువైన ప్రదేశం దొరకలేదు కాబోలు! ఇంకా ఎంతసేపు ఈ చిత్రవధ...ఒక్కసారి చంపేస్తే పోలా?'' ప్రాణం వదిలివేయడానికి సన్నద్ధమవుతున్నాడు వెంకటేశం. రామనామ స్మరణ ప్రారంభించాడు.

తన జీవితాన్ని భీమాచేయని విషయం జ్ఞాపకానికి వచ్చింది వెంకటేశానికి. భార్యాబిడ్డలు కళ్ళముందు మెదిలారు. "వాళ్ళ గతి ఏమిటి? చిప్పచేత పుచ్చుకొని వీధెక్కవలసిందేనా?'' దుఃఖం పెల్లుబికి వస్తోంది. బయట పడలేని దుఃఖం గుండెని బరువెక్కిస్తోంది.

యాకూత్పురా మెయిన్ రోడ్ వచ్చింది. అల్లరిమూకలు చాలా బల్బులు పగలకొట్టడం వల్ల, అక్కడక్కడ దూరదూరంగా వెలుగుతున్నాయి దీపాలు. రోడ్డుమీద వెలుతురు మసక మసకగా ఉంది. ఎప్పుడూ జనం తిరుగుతూ ఉండే ఆ రోడ్డు ఖాళీగా ఉంది.

మెయిన్‌రోడ్ కంటపడగానే ప్రాణంలేచి వచ్చినట్లయింది వెంకటేశానికి ఆశాకిరణం కొంచెం కొంచెం వెలికి రాసాగింది. వెనువెంటనే ఆలోచన ఒకటి వచ్చింది— "ఇప్పుడు తాను తిన్నగా ఇంటికి వెళ్ళిపోతే, ఈ రిక్షావాడు ఇల్లు గుర్తుపెట్టుకొని, తనముఠాతో, ఈ రోజుకాని, మరోరోజుకానివచ్చి మీదపడితే! ఈ రాత్రి నా ప్రాణం తీయడానికి వీళ్ళకి వీలు చిక్కలేదు. అవకాశం చూసుకుని వాడు ఎప్పుడు ఏమి చేస్తాడో! కనుక వీడికి నా ఇంటి ఆచూకీ తెలియనీయకూడదు.'' వెంకటేశం మెదడు పాదరసంలా పనిచేస్తోంది.

రిక్షా జాఫర్ జంగ్ చౌరస్తా సమీపించింది. వెంకటేశం ఇల్లు దగ్గరకు వచ్చేస్తోంది. తాను ఇక్కడే దిగిపోయి, రిక్షావాడిని పంపించేసి ఇంటికి వెళ్లిపోతే ఏ భయమూ ఉండదు.'' తన ఆలోచనకి తనని తానే మనస్సులో అభినందించుకున్నాడు వెంకటేశం.

"రిక్షా ఇక్కడే ఆపేయి'' అని అరిచాడు వెంకటేశం ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో. చౌరస్తాలో మెర్క్యురీ దీపం ప్రకాశవంతంగా ఉంది.

రిక్షా ఆగింది. ఒక్క ఉదుటున క్రిందకు దూకాడు వెంకటేశం. జేబులోంచి డబ్బు తీశాడు. రెండు రూపాయల నోటు వచ్చింది. అది రిక్షావాడి చేతిలో పెట్టి హడావుడిగా వెనుదిరిగాడు.

# చీకట్లో వెంటాడిన నీడ

"చిల్లర నై సాబ్" అన్నాడు రిక్షావాడు.

"నా దగ్గరాలేదు. పర్వాలేదు ఉంచుకో" అంటూ పరుగెత్తుతున్నట్లు నడవడం మొదలు పెట్టాడు వెంకటేశం, ఎదుటి సందులోకి.

"సాబ్...సాబ్" అంటూ రిక్షా తొక్కుకుంటూ వెనకాలే వచ్చాడు రిక్షావాడు

వెంకటేశం గుండె ఝల్లుమంది. "సందేహంలేదు. అనుకోకుండా నేను ఇక్కడే దిగిపోవడంతో, కొయ్యబారిపోయాడు వెధవ; నన్ను చంపాలన్న విషయం జ్ఞాపకానికి వచ్చి ఉంటుంది. వెంటపడ్డాడు వెధవ" ఆలోచనలు వెంకటేశం మనస్సుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

"సాబ్ మీ ఇల్లు గుర్తు చెప్పండి. పొద్దున్నే వచ్చి చిల్లర యిస్తాను" అంటున్న రిక్షావాడి మాటలతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు వెంకటేశం.

"వద్దులే. నేను ప్రొద్దున్నే మళ్ళీ ఊరెళ్ళిపోతున్నాను. ఆ రూపాయి నువ్వే ఉంచుకో. చీకట్లో కష్టపడ్డావు" అంటూ వడివడిగా ముందుకుసాగాడు వెంకటేశం.

"షుక్రియా సాబ్" అంటూ వెనక్కి తిరిగాడు రిక్షావాడు.

"వెధవ...వీడి ఎత్తులు నా దగ్గరా... చిల్లర పొద్దున్న తెచ్చి ఇస్తాడుట! ఎంత నిజాయితీ! ఇల్లు గుర్తు తెలుసుకొని మళ్ళీ వచ్చి నా కొంప ముంచడానికేగా వీడి నాటకం! ఆ మాత్రం తెలుసుకోలేననుకున్నాడేమో! అమ్మా...నా దగ్గరా. చక్కగా అబద్ధం ఆడి రోకరా కొట్టించాను వెధవని..." తన తెలివితేటలకి తానే మురిసిపోయి, సంతోషంతో సాగిపోసాగాడు వెంకటేశం. సందు కారు చీకటిగానున్నా భయమే వేయడంలేదు అతనికి ఆ క్షణంలో.

"సాబ్" అంటూ వెనకాలనుంచి మళ్ళీ కేక వినిపించింది. వెంకటేశం గుండెల్లో పిడుగుపడింది. "బతికిబయట పడ్డాననుకుంటే మళ్ళీ ఇదేమికర్మరా భగవంతుడా ... స్వామీ ఏడుకొండలవాడా...నీ దర్శనానికి అతిత్వరలో వస్తాను. నన్ను కాపాడు" అనుకుంటూ నలువైపులా చూశాడు. అరఫర్లాంగు దూరంలో దీపం కనిపిస్తోంది రిక్షావాడికేక వినిపించుకోనట్లుగా పరుగు లంకించుకున్నాడు. కాని భయంతో కాళ్లు వణికిపోతుండడంతో అడుగులు తడబడుతున్నాయి. పరుగు సాగడంలేదు.

"సాబ్" అంటూ మళ్లీ కేకవినిపించింది.

"అయిపోయింది నాపని. నేను వీడిని వదలించుకున్నా వీడు నన్ను వదిలేటట్టు లేడు. బహుశా వీడి మురాకూడా వీడినివచ్చి కలిసి వుంటుంది. ఈ సందు చీకటిగా చాలా అనువుగా ఉంది. అందుకే.నన్ను సఫా చేయడానికి తన మురాతో వస్తున్నాడు. చివరకి వీడి చేతిలో నాకు దిక్కులేని చావు రాసిపెటినట్టుంది"– వెంకటేశం గుండె దడదడలాడిపోయింది.

ఎల్లాగైతే వెంకటేశం దీపస్థంభం సమీపంలోకి వచ్చేశాడు. రిక్షా బాగా దగ్గరికి వచ్చేస్తోంది. "ఇంక తనుఎల్లానూ తప్పించుకోలేడు. రోడ్డుమీద ఎవరూ లేకపోయినా,ఈ దీపం వెలుగులో నిలబడితే బహుశా వాడికి నన్ను ఏమీచేసే ధైర్యం ఉండకపోవచ్చు. ఏమైనా ఇంక తప్పించుకునే అవకాశం లేదు. ఇంక వాడినిఎదిరించి పోట్లాడి వాడిఅంతమో తన అంతమో తేల్చుకోవల్సిందే." అని నిర్ణయించుకున్నాడు వెంకటేశం. చావు తప్పదని తెలిసిన అతనికి ధైర్యం వెల్లువవలె రాసాగింది. తనంతట తనే రిక్షావాడి మీదికి పులిపిల్లలా దూకడానికి సిద్ధంగా ఉన్నాడు.

రిక్షా బాగా దగ్గరకి వచ్చేసింది. వెంకటేశం దీపం క్రింద నిలబడ్డాడు. రిక్షావాడు ఒక చేతిలో తన హ్యాండుబాగ్ ఎత్తిపట్టుకుని "సాబ్ ... సంచీ మరిచిపోయారు" అంటూ దగ్గరకి వచ్చి రిక్షా ఆపాడు.

ఆ బ్యాగ్‌ని చూడబట్టికాని, లేకుంటే రిక్షావాడి మీదికి ఉరికిఉండేవాడే వెంకటేశం.

రిక్షావాడు హేండ్‌బ్యాగ్‌ని వెంకటేశం చేతికిచ్చాడు అప్రయత్నంగా దానిని అందుకుని నిశ్చేష్టుడైపోయాడు అతడు.

"వస్తాను సాబ్" అంటూ తిరిగి రివ్వున రిక్షా తిప్పి తొక్కుకుంటూ వెళ్ళిపోబోయాడు. రిక్షావాడు.

ఆ మాటతో తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు వెంకటేశం అతనిలో సంతోషం ఉరకలు వేస్తోంది తాను రిక్షావాడిని అనుమానించినందుకు హృదయం సిగ్గుతో కృంగిపోతుంటే అతను చూపించిన నిజాయితీ మనస్సుని చెళ్ళున కొడ్తోంది వివిధ భావాలు ఒకదాన్ని ఒకటి తరుముకొని వస్తున్నాయి.

"ఇదుగో ... ఇల్లారా" అంటూ గట్టిగా పిలిచాడు వెంకటేశం. రిక్షావాడు తిరిగి దగ్గరకు వచ్చాడు.

"నీపేరేమిటి?" ప్రశ్నించాడు వెంకటేశం

'అఫ్జల్‌ఖాన్" అన్నాడు రిక్షావాడు.

"నీ నిజాయితీకి నాకు చాలా సంతోషంగా ఉంది. ఇదుగో ఈ బక్షీష్ తీసుకో" జేబులోంచి డబ్బుతీసి ఇవ్వబోయాడు వెంకటేశం.

"వద్దుసాబ్...అల్లా దయసూడాలి. నీకే నేను రూపాయి ఇయ్యాలి" అంటూ పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు, రిక్షావాడు వడివడిగా రిక్షా త్రొక్కుకుంటూ.

వెంకటేశం కళ్ళలో ఆనందభాష్పాలు నిండాయి. తాను సృష్టించుకున్న నరకంలో తాను బందీకావడం తలపులోకి వచ్చింది. తనని చూసి తనకే నవ్వు వచ్చింది. తనపై జాలివేసింది – అసహ్యం వేసింది. ఆ రిక్షా కనుమరుగయ్యేదాకా చూస్తూ ఇంటి దారి పట్టాడు.

